చెత్త ఎత్తరు.. సంపద సృష్టించరు!

- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు
- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- పారిశుధ్యంపై కొరవడిన పర్యవేక్షణ

రొళ్ల: చెత్తను సేకరించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దాని ద్వారా ఆదాయం సృష్టించాలని ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఇక చెత్త లేకపోవడంతో చెత్త సంపద కేంద్రాలు నిరుయోగంగా మారాయి. మండలంలో 10 పంచాయతీలు ఉండగా రూ.5 నుంచి రూ.7.5 లక్షల చొప్పున వెచ్చించి ఒక్కో పంచాయతీలో ఒక్కో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (డంపింగ్ యార్డు) నిర్మించారు.

చెత్త ఎత్తితో ఒట్టు..

గ్రామాల్లో నిత్య తయారైన చెత్త చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే చెత్తను తొలగించకపోవడంతో పాఠశాల ఆవరణాలు, ప్రభుత్వ కార్యాలయాల పక్కన, గ్రామాల్లో వీధివీధినా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చాలా గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించినా డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తరలించడంతోపాటు సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రొళ్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

ప్రధానరోడ్డుపై మురుగునీరు



గ్రామాల్లో ఎక్కడా చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. మా గ్రామంలో ప్రధాన రోడ్డుపై ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాలకు వెళ్లే రోడ్డుతో పాటు అన్ని విధులతోపాటు మురుగుకాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు వృద్ధి చెంది గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు.

– ఎం.నాగరాజు, టీడీపల్లి, రొళ్ల మండలం

నిరుపయోగంగా సంపద కేంద్రం



మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామాల్లో ప్రతి వీధుల్లోను చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అయితే ఇంత వరకు సక్రమంగా ఒక్కసారి కూడా చెత్తను తొలగించలేదు. మురుగుకాలువలో పూడికతో మురుగు ముందుకుపోక దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో దోమల బెడద భరించ లేక పోతున్నాం. పూర్తి స్థాయిలో చెత్తను తొలగించి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

క్లుప్తంగా

జిల్లా జడ్జికి సన్మానం



జిల్లా జడ్జి భీమారావును సన్మానిస్తున్న ఏజీపీ భాస్కర్ రెడ్డి

పెనుకొండ రూరల్: కోర్టు భవనాల పరిశీలనలో భాగంగా ఆదివారం జిల్లా జడ్జి భీమారావు పెనుకొండకు విచ్చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా జడ్జి భీమారావుకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏజీపీ భాస్కర్ రెడ్డి తదితరులు జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కోర్టు అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ శ్రీధర్, లాయర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న నందవర్ధన రెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలో కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి ఇదే గ్రామానికి చెందిన నందవర్ధనరెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నందవర్ధన రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రేపటి రామచంద్రారెడ్డి, గొల్లశ్రీరాములు, చింతా కృష్ణారెడ్డి, రేపటి కృష్ణారెడ్డి, అశ్వర్థరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అబ్దుల్ ఘనితో మాట్లాడుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ నేత అబ్దుల్ ఘని సతీమణి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి ఆదివారం హిందూపురంలోని ఘని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీ ఉల్లా, నేతలు మహేష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ రోషన్ అలీ, జయప్ప, మల్లికార్జున, రామచంద్ర, సాజియాభాను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూల రథోత్సవం



కాళికా దేవి అవతారంలో అమ్మవారు

పావగడ: స్థానిక నల్లరాళ్ల గంగమ్మ, ఏడుగురు అక్కమ్మ గార్ల జాతరలో భాగంగా అమ్మవారి పూల రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారు కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి తిరుమంజన సేవలు నిర్వహించారు. ముత్తయిదువలు నిర్వహించిన జ్యోతి మహోత్సవ వేడుకలు ఆకట్టుకున్నాయి. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ టెంకాయల రవి నేతృత్వంలో నిర్వహించిన అమ్మవారి పూల రథోత్సం దేదీప్యమానంగా కొనసాగింది.

బీజేపీలోకి కేఆర్పీపీ నేత



బీజేపీలోకి చేరుతున్న నాగేంద్రకుమార్

పావగడ: తాలూకాలోని నేరళకుంటి గ్రామానికి చెందిన కేఆర్పీపీ నాయకుడు నాగేంద్రకుమార్ ఆదివారం బీజేపీలోకి చేరాడు. స్థానిక సీనియర్ బీజేపీ నేత, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు డా జీ వెంకట్రామయ్య సమక్షంలో బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. నాగేంద్రకుమార్ ఇదిలా ఉండగా గత విధాన సభ ఎన్నికల్లో బళ్లారి జనార్దనరెడ్డి నేతృత్వంలోని కేఆర్పీపీ తరపున పావగడ విధాన సభ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఘోర ఓటమిని చవి చూశారు. అనంతరం రాజకీయాల నుంచి కను మరుగైన నాగేంద్ర కుమార్ హఠాత్తుగా రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చారు. కార్యక్రమంలో పావగడ మండల బీజేపీ అధ్యక్షుడు బీఆర్ అశోక్, బీజేపి రాజ్య సభ్యుడు రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం



హిందుపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

కాలువల్లో పేరుకుపోయిన చెత్త



చైతన్యనగర్ వద్ద పెద్ద కాలువలో చెత్తాచెదారం

హిందూపురం: హిందూపురం పట్టణంలోని చైతన్య నగర్ వద్ద ఉన్న పెద్దకాలువలో వారం రోజులుగా చెత్తాచెదారం మురుగు శుభ్రం చేయకపోవడం కాలువలో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు కంపుతో అల్లాడిపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరారు.

‘పెద్దిరెడ్డి’పై ఆరోపణలు మానుకోవాలి

- ఆనందరంగారెడ్డి

మడకశిర: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి హితవుపలికారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి తన పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడానికే ప్రాధాన్యత ఇచ్చారే గానీ సూపర్ సిక్స్ హామీలపై మాట్లాడలేదన్నారు. కనీసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధం లేదన్నారు. పుంగనూరు ప్రాంతంలో అటవీభూములను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించుకోలేదని విచారణలో బయటపడిందని గుర్తు చేశారు. అయినా పెద్దిరెడ్డిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మానుకోకపోతే ప్రజా కోర్టులో శిక్ష పడటం ఖాయమని హెచ్చరించారు.

మే డే ర్యాలీ జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1న జరిగే ర్యాలీ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ జేఏసీ కార్యాలయంలో ఏఐటీయూసీ తాలూకా సమితి సమావేశాన్ని తాలూకా కార్యదర్శి మారుతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా 1వ తేదీ జెండా ఆవిష్కరణ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కార్యక్రమం ఉంటుందని, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం మేడే వేడుకల కరపత్రాలను విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి నరేష్, మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాలప్ప, కార్యదర్శి సిద్దగిరి సురేష్, ఉపాధ్యక్షుడు ఈరప్ప, నౌషద్, కమల్ భాష, జియా, అన్సార్, ఫాజిల్, రహమతుల్లా, బాబు, తదితరులు పాల్గొన్నారు.

30 లోపు ఈకేవైసీ చేయించుకోండి

అమరాపురం: మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీలోపు ఈ- కేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ ఆదివారం కోరారు. కార్డుదారులు వారి పరిధిలోని డీలర్ లేదా సచివాలయం వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు.

గడ్డి వామికి నిప్పు

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామంలో రైతు అశ్వర్థ నారాయణకు చెందిన గడ్డి వామికి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పశువుల మేత కోసం ఇంటి వద్ద గడ్డిని నిల్వ చేసినట్లు రైతు అశ్వర్థ నారాయణ తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఘటనపై పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

హిందూపురం టౌన్/చిలమత్తూరు/లేపాక్షి: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారి శ్రీధర్ ఆదివారం తెలిపారు. పుస్తక పఠనం, కథలు వినడం, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే చిలమత్తూరు, లేపాక్షిలోని గ్రంథాలయాల్లో సోమవారం నుంచి సమ్మర్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారులు మల్లికార్జున, జయసింహరాజు తెలిపారు.

యవకుడికి తీవ్రగాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని సామలపల్లి సమీపంలో హిందూపురం-గోరంట్ల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మిషన్ తండాకు చెందిన వసంత నాయక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వసంత నాయక్ రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 108లో చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చలివేంద్రం ఏర్పాటు

పెనుకొండ రూరల్: పట్టణంలోని తెలుగు తల్లి కూడలిలో ఏఐటీయూసీ అనుబంధ ఆటో కార్మికులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఏఎస్ఐ మారుతి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డ్రైవర్లు కూడా వేగం కన్నా ప్రయాణికుల ప్రాణం మిన్న అనే విషయాన్ని గుర్తించాలన్నారు. నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమేష్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

పెనుకొండ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఆదివారం పట్టణంలోని వజ్రాలపేటకు చెందిన గిరిధర్ పల్లెల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇంటి వద్దనే మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేసవి దృష్ట్యా ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలు నుంచి 3 గంటల వరకూ మజ్జిగ అందజేస్తామని తెలిపారు.

ఆశాజనకంగా మామిడి

పావగడ: తాలూకా వ్యాప్తంగా మామిడి తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. సుమారు 1,583 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగు చేశారు. తాలూకాలోని నిడుగల్ హోబళీ లో 523, వైఎన్ హొసకోట హోబళీ లో 465, కసబ హోబళీలఓ 439, నాగలమడక హోబళీ లో 156 హెక్టార్ల విస్తీర్ణం లో మామిడి తోటలు సాగు చేశారన్నారు. వాటిలో అల్ఫాన్సో, తోతాపురి, సేంధూర రకాల మామిడి పంటలు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ సారి అధికంగా మామిడి పంటల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యాన శాఖ ఏడీ రాఘవేంద్ర తెలిపారు. గతేడాది తాలూకా వ్యాప్తంగా అధిక వర్ష పాతం నమోదు కావడంతో మామిడి తోటలకు సహాయ కారిగా నిలిచిందన్నారు. ఈ సారి మామిడి పంటలు 70 శాతం మేర దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు.



విరగ్గాసిన మామిడి పండ్లు

సుమారు 11.250 టన్నుల మామిడి కాయలు వస్తాయన్నారు. సుమారు 409 హెక్టార్ల విస్తీర్ణానికి రైతులు పంట బీమా చేశారన్నారు. తప్పనిసరి రైతులు పండ్ల తోటలకు పంట బీమా చేసుకోవాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ నివాసంలో మండల స్థాయి కమిటీ ఎంపికపై చర్చించారు. ఈసందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎదురు తిరిగే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కూటమి నాయకుల దౌర్జన్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

పరిగి: కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ యథేచ్ఛగా ఇసుక, మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పరిగి మండలంలోని పెన్నా, జయమంగళి నదుల్లో ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో ఓ ఇటుక బట్టీ యజమాని అధికార బలంతో రోజంతా ఇసుకను తరలించాడు. ఇళ్ల మధ్యే యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ శాఖ సిబ్బంది స్పందించకపోవడం విడ్డూరం. కనీసం అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదు. అధికార దాహంతో ఇలా ఇసుకను దోచుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజలు చెబుతున్నారు.



శ్రీరంగరాజుపల్లిలో ఇసుకను అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

వరికోత యంత్రాలకు డిమాండ్

మడకశిరరూరల్: మండలంలో వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది రబీలో బోరు బావుల కింద మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో దాదాపు 230 ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేశారు. పంటకు తెగుళ్ల వ్యాప్తి అంతంత్ర మాత్రమేగానే ఉంది. వరి,రాగి, మొక్కజొన్న తదితర పంటలు కోతకు వచ్చాయి. అకాల వర్షం కారణంగా ఈదుర గాలులతో కూడిన వర్షం రెండు, మూడు రోజుల నుంచి పడుతోంది. దీంతో కోతకు వచ్చిన పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో కూలీలు దొరకకపోవడంతో వరికోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.4 వేలు చెల్లించి వరి పంటను కోయిస్తున్నారు. యంత్రాలతో త్వరగా పని పూర్తవుతుందని, అయితే పశుగ్రాసం దెబ్బతింటుందని రైతులు తెలిపారు.



వరి కోస్తున్న యంత్రం

పైప్‌లైన్‌కు లీకేజీ



కలుషితం అవుతున్న తాగునీరు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద డ్రైనేజీకి ఆనుకుని ఉన్న తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. మురుగు తాగునీటి పైప్‌లైన్‌లోకి వెళ్లడంతో తాగునీరు కలుషితం అవుతోంది. పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక ’

రొళ్ల: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కర వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

11 నుంచి ఏటి గంగమ్మ సంబరాలు

తలుపుల : మండల కేంద్రం ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద మే 11 నుంచి మూడు రోజుల పాటు సంబరాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా గంగమ్మ ఆలయం వద్ద సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



అలంకరణలో స్వామివారు

‘హంద్రీ-నీవా నీరు వినియోగంలోకి తెండి’

హిందూపురం: హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు నాలుగేళ్లుగా హంద్రీ-నీవా నీరు వదలక పోగా ఏటా 500- 900 క్యూసెక్కుల నీరు సముద్రం పాలు చేస్తున్నారని జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి ప్రకటనలో వాపోయారు. చేరువలో హంద్రీ-నీవా ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాలో బోర్లు ఎండిపోతున్నాయన్నారు. సముద్రంలో కలిసే నీటిని మళ్లించి చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలం అవుతోందన్నారు. ఇటీవల అగళిలో మహిళలు నీటి కోసం రోడెక్కినా పాలకులు స్పందించడం లేదన్నారు. అలాగే బోర్లలో నీళ్లు రావడంలేదని హిందూపురం రైతులు అర్జీలు ఇచ్చేదాకా పట్టించుకోకపోవడంలో పాలకులు, అధికారుల ముందు చూపు ఏమాత్రం ఉందో తెలుస్తుందన్నారు. అలాగే హంద్రీ-నీలో పూడిక తీసి చెట్లు, గడ్డి తొలగించి వెడల్పు చేయాలన్నారు

మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

మడకశిర: నియోజకవర్గంలోని 4 మద్యం షాపులకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, సీఐ గురునాథరెడ్డి ఆదివారం తెలిపారు. మడకశిరరూరల్ మండలంలోని 80, 81, అమరాపురం మండలం 84, గుడిబండ మండలంలోని 87వ నంబర్ షాపునకు రీ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఆన్‌లైన్‌లో గానీ ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఎక్కడి నుంచైనా ఈ షాపులకు హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు మే 3వ తేది సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఫీజు వాపస్ ఇవ్వమని తెలిపారు. మే 5న పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఈ షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు వారు వివరించారు.

ఎస్ఎఫ్ఐకి పలువురి రాజీనామా



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు

హిందూపురం టౌన్: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ తీరును నిరసిస్తూ ఎస్ఎఫ్ఐకి, సీపీఎం సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు తరుణ్, పవన్, హుస్సేన్, లిఖిత్ తదితరులు తెలిపారు. ఆదివారం వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాకు సమాచారం ఇవ్వకుండా కమిటీలు వేయడం, సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. పలుమార్లు పార్టీ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించ లేదన్నారు. వీరేష్ వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటూ ఆర్గనైజేషన్‌లో పనిచేస్తున్నాడన్నారు. అలాంటప్పుడు తాము పనిచేయాలని ఎంత ప్రయత్నించినా జిల్లా అధ్యక్షుడు స్పందించలేదని, తాము పనిచేయడం సరికాదేమో అని భావించి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిభా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ సుందరరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేపాక్షి గురుకుల పాఠశాలలో 302 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 97 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న యువసేనా నాయకులు

లేపాక్షి: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేనా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతనాగ్ జిల్లా పహల్గాం సమీపంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ సంఘీభావం తెలిపారు. అనంతరం దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.